క్లుప్తంగా

వైభవంగా బ్రహ్మోత్సవాలు



చిట్టేల(వత్సవాయి): శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండవరోజు ఆదివారం పుణ్యాహవాచన, భేరీపూజ, ధ్వాజపట, యాగశాల, వాస్తు శుద్ధి ధ్వజపట ప్రతిష్ట అధివాస త్రయము, అధివాస హోమము, ధ్వజారోహణము కార్యక్రమాలను వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అర్చకులు హరి శివరామప్రసాదుశాస్త్రి, సిరికొండ వెంకటసాయి కృష్ణమాచార్యులు నిర్వహించారు. ఆలయ నిర్మాణ ధర్మకర్త మారెళ్ల పుల్లారెడ్డి దంపతులు గోపూజ, తులసీ పూజ, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

మహిళపై కత్తితో దాడి

వీరులపాడు: చిల్లర దుకాణంలో అప్పు ఇవ్వలేదని మహిళపై కక్షగట్టి ఆమెపై ఓవ్యక్తి కత్తితో దాడిచేసిన సంఘటన వీరులపాడు మండలం జయంతి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలి కుటుంబసభ్యులు తెలిపిన సమాచారం మేరకు.. జయంతి గ్రామంలో చిల్లర దుకాణం నడిపే మంగళపూడి వీరమ్మ వద్దకు గతంలో అదేగ్రామానికి చెందిన వేల్పుల సామ్యూల్ అనేవ్యక్తి వచ్చి అప్పు ఇవ్వమని అడగగా ఆమె నిరాకరించింది. దీంతో కోపం పెంచుకున్న అతను ఆదివారం సాయంత్రం కూరగాయలు కోస్తే కత్తితో ఆమెపై దాడిచేశాడు. ఈ ఘటనలో వీరమ్మ తీవ్రంగా గాయపడటంతో కుటుంబసభ్యులు ఆమెను నందిగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం విజయవాడకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహాలక్ష్మణుడు తెలిపారు.

ఘనంగా స్వరలయ ప్రథమ వార్షికోత్సవం



విజయాడకల్చరల్: స్వరలయ సాంస్కృతిక సేవా సంస్థ ప్రథమ వార్షికోత్సవాన్ని బందరురోడ్డులోని మాకినేని బసప పున్నయ్య స్టేడియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోలవరపు కోటేశ్వరరావు సాహిత్యపీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంస్థ కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పించి వారిని సత్కరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నాట్యాచార్యుడు సీహెచ్ అజయ్‌కుమార్ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు నేత్ర పర్వంగా సాగాయి. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ వస్త్రధారణ ఆకట్టుకుంది. స్వరలయ బృంద గాయకులు క్లాసికల్ గీతాలను మధురంగా ఆలపించారు. ఉదయం జరిగిన చిత్రలేఖనం పోటీ విజేతలకు, సినీ సంగీత కార్యక్రమంలో పాల్గొన్న గాయకులకు, నృత్య కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు, వరల్డ్ రికార్డ్ విజేత గాయని ఋుర్వేదం పద్మశ్రీకి హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వీఆర్‌కే కృపాసాగర్ చేతులమీదగా బహుమతులు అందజేశారు. సంస్థ సభ్యులు మోహన్ రాంప్రసాద్, రమణమూర్తి, ప్రవీణ్‌కుమార్, నాగలక్ష్మి, మిస్ విజయవాడ(2015) శ్రీసత్య పాల్గొన్నారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు పలువురు నృత్యకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన కళ్యాణి డ్యాన్స్ అకాడమీకి చెందిన చిన్నారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శనను భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించడమే కాకుండా చిన్నారులతో కలిసి సెల్ఫీలు, ఫొటోలు దిగారు. అనంతరం చిన్నారులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు.

భవానీపురంలో రామ్‌రాజ్ షోరూమ్ ప్రారంభం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ భవానీపురం స్వాతీ రోడ్‌లో రామ్‌రాజ్ కాటన్ కంపెనీ తమ నూతన షోరూమ్‌ను ఆదివారం ప్రారంభించింది. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానము కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావు, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధర రావు, పాపులర్ షూమార్ట్ మేనేజింగ్ పార్టనర్ చుక్కపల్లి విజయకుమార్ కలిసి ఈ షోరూమ్‌ను ప్రారంభించారు.

సంక్షేమానికి చిరునామా కె.పొన్నవరం

- పొన్నవరంలో 236 కుటుంబాలు
- గ్రామజనాభా 720మంది
- సీఎం జగనన్న పాలనలో ప్రతి ఇంటికి మేలు
- ఒక్కో కుటుంబానికి నాలుగైదు పథకాలు
- ఐదేళ్లలో అన్ని పథకాల ద్వారా గ్రామస్తులకు రూ.4.87కోట్ల లబ్ధి



ప్రభుత్వ విప్ ఉదయభానుతో కలిసి పింఛన్ కార్డులు చూపిస్తున్న కె.పొన్నవరం గ్రామానికి చెందిన చర్మకారులు, డప్పు కళాకారులు(ఫైల్)

కె.పొన్నవరం(పెనుగంచిప్రోలు): పాలకుడికి చిత్త శుద్ధి ఉంటే మారుమూల గ్రామంలో ఉన్నా మేలు చేకూరుతుందంటారు. అందుకు జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పెనుగంచిప్రోలు మండలం వెంకటాపురం గ్రామపంచాయితీ శివారు గ్రామంగా ఉన్న కె.పొన్నవరం గ్రామమే నిదర్శనం. ఈ గ్రామంలో 236 కుటుంబాలు ఉండగా, 720మంది జనాభా ఉన్నారు. వీరంతా ఎస్సీ సామాజికవర్గానికి చెందినవారే. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేసిన ఆయా పథకాల ద్వారా ఈ గ్రామంలోని ప్రతి ఇంటికి మేలు చేకూరింది. కొన్ని కుటుంబాలకు నాలుగైదు పథకాల ద్వారా లబ్ధి కలిగింది.

వ్యవసాయమే వీరికి జీవనాధారం..

ఈ గ్రామస్తులకు వ్యవసాయమే జీవనాధారం. మునేరు పక్కనున్న తమ పొలాల్లో లిల్లీ, బంతి పూల సాగుతోపాటు కూరగాయలు పండిస్తూ జీవనం సాగిస్తున్నారు. గతం టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు సూచించిన వారికే పథకాలు దక్కగా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హతే ప్రమాణికంగా అందరికీ పథకాలను అందిస్తోంది. దీంతో కె.పొన్నవరంలోని ప్రతి ఇంటికి పథకాలు అందాయి. అదేవిధంగా రైతుభరోసా, ఉచిత పంటల బీమా, ఆర్బీకేల ద్వారా సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందుకుంటున్నారు. దీంతో తమకు ఆర్థికభరోసా లభించిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.



కె.పొన్నవరం గ్రామ వ్యూ

కుటుంబానికి రూ.1.31లక్షలు..

గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల ద్వారా గ్రామంలోని ప్రతి కుటుంబానికి సరాసరిన రూ.1,30,572 లబ్ధి చేకూరింది. గ్రామంలోని ఒక్కో వ్యక్తికి సగటున రూ.42,798 అందాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మాదిరి గతంలో ఎన్నడూ ఇంతలా లబ్ధి కలగలేదని గ్రామస్తులు చెబుతున్నారు.

రూ.45లక్షలతో అభివృద్ధి పనులు..

నాడు-నేడు పథకం ద్వారా రూ.25 లక్షలతో గ్రామంలోని పాఠశాలను అభివృద్ధి చేశారు. దీంతో పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. రూ.11లక్షలతో డ్రైనేజీ నిర్మాణం, రూ.2లక్షలతో సీసీ రోడ్లు, రూ.7లక్షలు జలజీవన్ మిషన్ నిధులతో పైపులైన్ నిర్మాణం చేపట్టారు. ఇంటింటికీ కుళాయి ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి.

47మందికి, ఇళ్ల పట్టాలు...

గ్రామంలో మొత్తం 47మందికి పేదలకు ఉచితంగా ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఇళ్లు మంజూరు చేశారు. సెంటున్నర స్థలం విలువ రూ.లక్ష అనుకున్నా...ఇంటి నిర్మాణానికి అందించిన మొత్తం రూ.1.80లక్షలు కలుపుకుని లబ్ధిదారులందరికీ కలిపి రూ.1.31కోట్ల మేర లబ్ధి చేకూరింది. ఇలా గ్రామంలో అందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మేలు చేకూరడంతోపాటు సగటున ప్రతి ఇంటికి సుమారు రూ.1.31లక్షలు మేర లబ్ధి చేకూర్చడం ద్వారా తమకు ఆర్థికభరోసా కల్పించారంటూ గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. గ్రామస్తుల అభిప్రాయాలు..వారి మాటల్లోనే..

పొన్నవరం గ్రామస్తులకు ఐదేళ్లలో కలిగిన లబ్ధి..

పథకం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి
వైఎస్సార్ పింఛన్	132	రూ.79,20,000
చేయూత	102	రూ.95,62,500
అమ్మఒడి	98	రూ.73,50,000
ఆసరా	20	రూ. 5,20,628
విద్యాదీవెన	46	రూ. 9,00,000
వసతిదీవెన	46	రూ.12,00,000
చేదోడు	12	రూ. 4,80,000
వాహనమిత్ర	11	రూ. 4,00,000
వైఎస్సార్ బీమా	2	రూ. 2,00,000
రైతుభరోసా	18	రూ. 9,72,000
కల్యాణమస్తు	3	రూ. 3,00,000
ఉచిత పంటల బీమా	26	రూ.10,40,000
జగనన్న తోడు	3	రూ.1,20,000
ఆర్‌బీకేల ద్వారా ఎరువులు		రూ.1,50,000
ఆరోగ్యశ్రీ	236	
మొత్తం	755	రూ.3,11,15,128

మూడు పథకాలు వస్తున్నాయి



జగనన్న ప్రభుత్వంలో మాకు నాలుగు సంక్షేమ పథకాలు అందుతున్నాయి. నాకు ఇద్దరు ఆడపిల్లలు. పెద్దమ్మాయికి కల్యాణమస్తు పథకం ద్వారా రూ.లక్ష వచ్చాయి. చర్మకారుల పింఛన్ కింద నాకు నెలకు రూ.3వేలు చొప్పున నాలుగేళ్లుగా ఇస్తున్నారు.

– గొర్రెపాటి కోటయ్య

ఇంతకంటే ఎవరు చేస్తారు



నేను కూరగాయాలు, పూలసాగు చేస్తుంటాను. ఈ ప్రభుత్వంలో మా కుటుంబానికి రైతుభరోసా వస్తోంది. మా అమ్మాయికి అమ్మ ఒడి వస్తోంది. ఆసరా పథకం కింద లబ్ధి చేకూరింది. పేదల అభివృద్ధి కోసం ఇంతకంటే ఎవరూ చేయలేరు.

– జక్కులూరి దేవదాసు

అడగకనే అన్నీ ఇచ్చారు



మేము ఏమీ అడగలేదు. మొదట వలంటీర్ వచ్చి మా ఇంట్లో వాళ్ల వివరాలు రాసుకుని వెళ్లాడు. ఆ తరువాత మా కుటుంబానికి రైతుభరోసా అందుతోంది. పింఛన్ వస్తోంది. వైఎస్సార్ ఆసరా కింద డ్వాక్రా రుణమాఫీ జరిగింది. ఇంటి స్థలం కూడా ఇచ్చారు.

– కృష్ణవేణి

సంతోషంగా ఉంది



మా కె.పొన్నవరంలో అందరూ పేదలు ఉన్నారు. గతంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో ఎమ్మెల్యే ఉదయభాను ద్వారా మునేరు ఎత్తిపోతల పథకంతోపాటు కాలనీ ఇచ్చారు.ప్రస్తుతం సీఎం జగనన్న సంక్షేమ పాలనలో గ్రామానికి కోట్లాది రూపాయలు అందడం సంతోషంగా ఉంది.

– మార్కపూడి గాంధీ, ఎంపీపీ

జగనన్న మరోసారి సీఎం కావడం ఖాయం



భీమవరంలో ప్రచారం చేస్తున్న చింతకుంట్ల వెంకటరెడ్డి, రంగారెడ్డి, నాయకులు

వత్సవాయి : ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోమారు సీఎం కావడం ఖాయమని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతకుంట్ల వెంకటరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)ల విజయాన్ని కోరుతూ వత్సవాయి, మక్కపేట, మంగొల్లు, పోలంపల్లి, కంభంపాడు, చిట్టేల, కన్నెవీడు, ఇందుగపల్లి తదితర గ్రామాల్లో ఆపార్టీ నాయకులు ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఉదయభాను, కేశినేని శ్రీనివాస్‌లను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈసందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో సంక్షేమ పథకాలు టీడీపీ జెండా పట్టుకున్నవారికే అందించగా, ఐదేళ్లుగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని వివరించారు. సంక్షేమ పథకాలు అందరికీ అందాలంటే సీఎం జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావాల్సి ఉందన్నారు. ప్రచారం సందర్భంగా ప్రజల నుంచి లభిస్తున్న స్పందనను చూస్తుంటే సీఎంగా జగన్ మోహన్‌రెడ్డి మరోసారి బాధ్యతలు చేపట్టడం ఖాయమని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుండం రంగారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కొమెర చెన్నమ్మ, పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గంగిపోగు రమేష్, సర్పంచి కె.మాధురి, సొసైటీ అధ్యక్షులు పెనుగొండ శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగుల్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



తుర్లపాడులో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన అభివృద్ధి, సంక్షేమ పాలన ద్వారా రాష్ట్రంలోని పేదల జీవితాల్లో వెలుగు నింపారని నందిగామ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలోని కొడవటికల్లు, పున్నవల్లి, తుర్లపాడు, తోటరావులపాడు, చింతలపాడు గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా తనను, విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ని గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో భాగంగా గ్రామానికి వచ్చిన డాక్టర్ జగన్‌మోహనరావుకు ఆయా గ్రామాల ప్రజలు తీన్‌మార్ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ సీఎం జగనన్న నవరత్నాలు పథకాలతో పేదల కన్నీళ్లు తుడిచి వారి పెదవులపై నవ్వులు పూయించారన్నారు. తన ఐదేళ్ల సంక్షేమ పాలనతో మా నమ్మకం నువ్వే జగన్ అనేంతగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం పేరుతో టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ దుష్ప్రచారంపై సాగిస్తున్న వైనంపై ఈసీ ఆదేశాలతో వారిపై కేసు నమోదైందని వివరించారు. వారు ఇకనైనా ఇటువంటి దుష్ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. సీఎం జగనన్న పాలనలో గ్రామాలు, పట్టణాలకు దీటుగా అభివృద్ధిలో పరుగులు పెడుతున్నాయన్నారు. గ్రామసచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను గ్రామస్థాయికి తెచ్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని పేర్కొన్నారు. ప్రచారంలో ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, సర్పంచులు ఏశమ్మ, మోహనరావు, చావల రవిబాబు, ములకలపల్లి లక్ష్మి, మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వైఎస్ఎస్ ప్రసాద్, పెరమసాని నరసింహారావు, ఏరువ సత్యనారాయణరెడ్డి, ములకలపల్లి వెంకట్రావ్, దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



తోటరావులపాడులో ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



గూడెంమాధవరంలో తీన్‌మార్ వాయిద్యాలతో అభిమానుల సందండి

చౌటపల్లి, గూడెంమాధవరం గ్రామాల్లో...

వీరులపాడు: నందిగామ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఆదివారం వీరులపాడు మండలంలోని చౌటపల్లి, గూడెంమాధవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత ఆయా గ్రామాల్లోని వైఎస్సార్ సీపీశ్రేణులు, గ్రామస్తులు తీన్‌మార్ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. డాక్టర్ జగన్‌మోహనరావు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి నియోజకవర్గ అభివృద్ధికి చూసి తనను మరోసారి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచులు పల్లెపోగు పుల్లయ్య, బండి సునీత, ఉపసర్పంచి కోట సంగయ్య, కోట రామారావు, బండి మురళి, మట్టూరి సాయిబాబు, అనుమోలు వాసు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉదయభాను విజయం కాంక్షిస్తూ ప్రచారం



30 వార్డుల్లో ప్రచారంలో పాల్గొన్న ఉదయభాను సోదరి బేబి, కోడలు కావ్య, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభానును గెలిపించాలని కోరుతూ ఆయన కుటుంబసభ్యులు పట్టణంలోని 23, 30వ వార్డుల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయభాను సోదరి చాముండేశ్వరి (బేబి), కుమార్తె పద్మప్రియాంక, కోడలు కావ్య వార్డుల్లోని ఇంటింటికీ తిరిగి ఉదయభానును గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో వందలాది కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను గమనించాలని ప్రజలను కోరారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా ఉదయభాను, విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)లను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆయా వార్డు కౌన్సిలర్లు దువ్వల రామకృష్ణ, పందుల రోశయ్య, కాశి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

8వరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి అవకాశం



నందిగామలో ఓట్లు వేసేందుకు క్యూలైన్‌లో వేచిఉన్న ఉద్యోగులు



జగ్గయ్యపేటలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటున్న ఉద్యోగి

జగ్గయ్యపేట: ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగుల నిమిత్తం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల ప్రక్రియలో ఉద్యోగులు పాల్గొని తమ ఓటుహక్కును వినియోగించుకుంటున్నారు. రెండోరోజు ఆదివారం 597మంది ఉద్యోగులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. పోస్టల్ ఓటింగ్ కేంద్రాల్లో ఓటును వినియోగించుకునే క్రమంలో పలువురు ఉద్యోగులు అసౌకర్యానికి గురయ్యారు. పోలింగ్ సిబ్బంది దురుసుగా వ్యవహరించరంటూ పలువురు ఉద్యోగులు అసహనం వ్యక్తంచేయడంతో రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వర్లు స్పందించి పలు సూచనలు చేసి, ఉద్యోగులు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చేశారు. సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు పోస్టల్‌బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకోవాలని ఆర్వో సూచించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఇతర జిల్లాలోని ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారని వివరించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగం గడువును జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల ఎనిమిదో తేదీ వరకు పొడించినట్లు ఆర్వో తెలిపారు. ఈ నెల ఏడోతేదీ నుంచి జగ్గయ్యపేట నియోజకవర్గంలో హోమ్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమతుందని ఆయన వివరించారు.

నందిగామలో ..

నందిగామ: ఎన్నికల విధులకు హాజరవుతున్న 509మంది ఉద్యోగులు ఆదివారం స్థానిక కేవీఆర్ కళాశాలలోని పోలింగ్‌కేంద్రంలో తమ పోస్టల్ బ్యాలెట్ ఓటుహక్కును వినిగించుకున్నారు. నందిగామ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1968 ఉండగా శనివారం 494 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సందర్భంగా కేవీఆర్ కళాశాల వద్ద పోలీసులు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసులతోపాటు సిఆర్‌పిఎఫ్ బలగాలతో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

జగన్‌మోహనరావు గెలుపు కోరుతూ ప్రచారం



పెండ్యాలలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎంపీపీ మలక్‌బషీర్, నాయకులు



కంచికచర్లలో ప్రచారం చేస్తున్న నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు తదితరులు

కంచికచర్ల : వైఎస్సార్ సీపీ నందిగామ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని) గెలుపు కోరుతూ కంచికచర్ల ఎంపీపీ మలక్‌బషీర్ పెండ్యాలలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి ఓట్లేసి మరోసారి గెలిపించాలని ఓటర్లను కోరారు. సీఎం జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు అందుకున్నవారంత ఈ ఎన్నికల్లో ఆయనకు అండగా నిలవాలని కోరారు. ప్రచారంలో మాజీ సర్పంచి షేక్ ఖాజాపాషా, వక్ఫ్‌బోర్డు జిల్లా కార్యదర్శి షేక్ గౌస్‌పాషా, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్లలో..

నందిగామ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ జగన్‌మోహనరావుకు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)ల ఎన్నికల గుర్తు ఫ్యాన్‌కు ఓటెయ్యాలని ఆ పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబులు అన్నారు. కంచికచర్లలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈమేరకు నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందాలంటే మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీని ప్రజలంతా ఆశీర్వదించి ఫ్యాన్ గుర్తుకే ఓటెయ్యాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మాడుగుల మధుబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, పార్టీ నాయకులు దాసరి రాము, దేవరకొండ గురవయ్య, వేమా శివకోటి, ఎం.పాండు నారిశెట్టి శ్రీనివాసరావు, దేవిరెడ్డి శ్రీనివాసరావు, శీలంనేని గోపాలకృష్ణ, గుత్తా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వడగాడ్పుల తీవ్రతకు ఇద్దరు వృద్ధుల మృతి

వీరులపాడు: భానుడి ప్రతాపానికి తట్టుకోలేక వడగాడ్పుల ప్రభావంతో అస్వస్థతకులోనై ఇద్దరు వృద్ధులు మృతి చెందారు. మండలంలోని చెన్నారావుపాలెం గ్రామానికి చెందిన కోట సుశీలమ్మ (80), మోగులూరి స్వరాజ్యం (65) వడగాడ్పుల కారణంగా అస్వస్థతకు గురై శనివారం రాత్రి మృతి చెందినట్లు వారి కుటుంబసభ్యులు తెలిపారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం



ప్రసంగిస్తున్న జోసఫ్ రాజారావు

మైలవరం: క్రీస్తు మార్గం అనుసరణీయమని విజయవాడ కథోలిక పీఠాధిపతి తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. మైలవరం శాంతినగర్‌లోని ఆర్‌సీఎం చర్చి విచారణ ప్రాంగణంలో నిర్వహిస్తున్న క్రైస్తవ సహాయ మాత దేవాలయం స్వర్ణోత్సవాలు మూడో రోజు ఆదివారం ముగింపు కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. 1974లో అప్పటి విచారణ గురువుగా దివంగత బిషప్ మాథ్యూ చెరియన్ కున్నెల్ అడవిగా ఉన్న ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి మొదటిగా కొండపల్లి, అనంతరం చంద్రగూడెం, మైలవరం విచారణగా ఏర్పాటు చేసి ఈ దేవాలయాన్ని నిర్మించారని చెప్పారు. క్రైస్తవుల సహాయమాత విచారణ పేరుతో నేటికీ కొనసాగుతుందన్నారు. విశ్వాసంతో చేసిన ప్రార్థనల వల్ల ఎన్నో మేలులు జరుగుతాయని చెప్పారు. ఈ సందర్భంగా దేవాలయ నిర్మాణానికి సహకరించిన వారిని గుర్తు చేసుకున్నారు. ఇక్కడ పనిచేసిన మత గురువులను సత్కరించారు. ఈ సందర్భంగా విచారణ గురువు కె. అనిల్ ఫ్రాన్సిస్ 150 మంది బాలబాలికలకు తొలిసారిగా దివ్య సత్ప్రసాదం అందించారు.